


# శుద్ధాంత కాంత రాజ్యం

సీనయ్యగారిది వూళ్లో పలుకుబడిగల చెయ్యి. ఆయనకాస్తో ఆస్తి వున్నా లేకపోయినా ఏదో వందన్నర ఎకరాల మాగాణిమాత్రం వుందని వదంతి. ఆవిషయం ఆయనగారెవరితోనూ, ఏ సందర్భంలోనూ చెప్పకపోయినా అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే అది. అసలు నిజం మాట్లాడితే ఎక్కడెంత పొలంవుందో ఆయనకే తెలీదు నిక్కచ్చిగా. సిస్తు కట్టేప్పుడు మాత్రం యింత వుంది గదా అని అనుకుంటాడు.

అట్టాంటి సీనయ్య గారికి కూతురు పుట్టింది. మగనలుసు పుట్టకపోవటం లోపమేగాని, అసలు లేని లోపాన్ని తీర్చటంవల్ల రాజమ్మను గారాబంగానే పెంచుకుంటున్నారు. రాజమ్మ పుట్టినప్పుడు సీనయ్యగారు కొంచెం విచారం తెలియచేశాడు. కొడుకు లేడే అని. తాను కష్టపడితే భార్య ఏమనుకుంటుందో అని తమాయించుకున్నాడు కూడా. రాజమ్మ బారసాలకి వాళ్ళ అమ్మ తరఫు వాళ్ళంతా వచ్చారు. దగ్గిర బంధువులు కూడా చాలామంది వచ్చారు బారసాల పూర్తి చేసి వెళ్ళటానికి. వచ్చినవారు వుత్తచేతుల్తో వెళ్ళటం ఆచారం కాదుగనుక పిల్లకేవేవో చదివించారు. మొత్తం కట్నాలతాలూకు రాజమ్మకు ఓ రెండు వేల సామాను కిట్టిందని వినికిడి.

అయిదో యేటే వీధిబళ్లో వేశారు రాజమ్మను. ఆ యింటిల్లిపాదికీ చదువు అచ్చుబాటు లేక పోయినా రాజమ్మకు అతితొందరగా చదు వచ్చింది; చదువుతో బాటు రాజమ్మ వయస్సు, వయస్సుతో బాటు అందం, అందంతో పాటు ఆమె మీద ఆదరం ఎక్కువయింది చాలా మందికి.

రాజమ్మకు పన్నెండేళ్లు వచ్చేసరికి పల్లెటూరి చదువు పూర్తయింది. అంతటితో చదువుపూర్తి చేసి పెళ్ళి ప్రయత్నం చేద్దామనుకున్నారు రాజమ్మ నాయనమ్మా వాళ్లు- కాని 'దాని కప్పుడే ఏం పెళ్ళి అమ్మా పసిది' అని సీనయ్య గారనటంతో ఎవరూ ఆ ప్రసంగం తిరిగి తీసుకురాలేదు.

రాజమ్మకు యింగ్లీషు చెప్పించమని వాళ్లూ వీళ్లూ యిళ్ళ పొరుగువాళ్లు చెప్పారు - మధ్యాహ్నమప్పుడు వాళ్ళయింటికి వచ్చినవాళ్ళుకూడా ఒకటే పోరు పెట్టటం ప్రారంభించారు- 'రాజమ్మకు డాక్టరమ్మ అయ్యే కళలున్నాయి చూశావా! నా మాటని ఎందుకు చెడగొడతారు గాని ఇంగ్లీషు చదువులు చెప్పించి లేడీడాక్టర్ని చెయ్యండి బావుంటుంది' అన్నది వెంకాయమ్మొదినె-మాటల సందర్భంలో గట్టిగానే.

'ఇదిగో పిన్నీ చూశావా - రాజ్యం యింత తెలివి గలదిగదా ఆ కళ్ళల్లో పంతులమ్మ చూపులున్నాయి కదా ? ఇంకా వూరుకుంటారేం బస్తీలో వెయ్యక' అన్నది పక్కింటావిడ కూతురు.

వి. శార్వరి

ఇట్లాంటి మాటలు వింటుంటే రాజమ్మకు ఆకాశాన తిరిగి నట్టుగా వుండేది. సీనయ్యగారికి స్వర్గంలో వున్నట్టుగానే వుండేది నిజానికి.

మొత్తానికి సీనయ్యగారి సంసారం బస్తీకి బదిలీ అయింది. రాజమ్మను హైస్కూల్లో చేర్చారు. రవ్వలాగా పైకొస్తుంటే రాజమ్మను చూసి తండ్రి మురిసి పొయ్యేవాడు.

రాజమ్మ వెనకటి రాజమ్మ కాదిప్పుడు. 'రాజ్యం'. స్కూల్లో అంతా రాజ్యం అనేవాళ్లు. అంతా రాజ్యం అంటే తామూ రాజమ్మ అంటే అసహ్యంగా వుంటుందని సీనయ్య, సీనయ్య పెళ్ళాంకూడా రాజ్యం అనే పిలిచేవాళ్లు. రాజ్యం యిప్పుడు బస్తీ పిల్ల. అందులో ఇంగ్లీషు చదువుతోంది. అందంగలది. చురుకుగల పిల్ల.

రాజమ్మ తెలివితేటల ముందు మిగతా ఆడపిల్లలంతా బలాదూరు. ఆడపిల్లలే కాదు. మగపిల్లలుకూడా ఏ ఒక్కరూ చదువులో ఆమెకి పోటీ చేయలేకపోతున్నారు. అందులో రాజమ్మ అందమైందనుకున్నాం. అందువల్ల మేష్టర్లందరికీ ఆమె అంటే అనురాగం, ప్రేమా జాస్తయింది. ఎవ్వరూ సమాధానం చెప్పలేని ప్రశ్నలకు ఆమె సమాధానం చెప్పటంవల్ల హిస్టరీమాష్టరు కళ్ళన్నీ ఆమెమీదే వుండేవి మరీన్ను. అసలు డ్రాయింగు మాష్టరు బొమ్మ గీయటం, పిల్లలంతా వేసుకుంటూంటే రాజ్యంవైపు గుటకలు మింగుతూ చూస్తుండేవాడు. దగ్గరకి పిలిచి బొమ్మ వేయటం చూపించే మిషతో ఆమె వేళ్లు తాకేవాడు. ఆమె కళ్లల్లోని వెలుగుల్ని మింగేవాడు, తెలుగుమాష్టరు మరీ ఘోరం. పద్యం తీరా అప్పచెప్పాక 'ఎట్లాగైనా రాజ్యం రాజ్యమే' అని బుగ్గగిల్లేవాడు ఖుషీగా. ఈ మాష్టర్ల ప్రవర్తన రాజమ్మకు ఎట్లానో వుండేది.

రాజ్యం స్కూలుఫైనలు కొచ్చింది. అంతా మారిపోయింది. మాష్టర్లవంక చూసేదిగాదు. అంటుకోనిచ్చేదిగాదు. వెనకటిలాగా చలాకీగా వుండటం మానేసింది. ఎంతో గాంభీర్యంగా వుండేది. మగపిల్లలవంక అసలు చూసేదిగాదు. ఆడపిల్లలతో అదోక గర్వంగా వుండేది. రాజ్యం ఇట్లా బెట్టుగా వుంటున్న కొద్దీ ఆమెమీద మగపిల్లలకి చాలామందికి ఆశ కలిగింది. కాని ఆమె 'రాజ్యం' కావటంవల్ల ఎవరి ఎత్తులూ సాగేవి కావు. అదే మరో ఆడపిల్ల అయితే—

రాజ్యం స్కూలుఫైనలులో వుండగా మంచి మంచి సంబంధాలు వొచ్చినయ్. పెద్దపెద్ద ఆస్తిపరుల పిల్లలకే అడిగారు. వేలకువేల ఎకరాల పొలాలున్నవాళ్లు, అదున్నవాళ్లు ఇదున్నవాళ్లు యెంతమంది వచ్చినా రాజ్యం యిష్టం లేక పోవటంవల్ల సీనయ్య ఎవరికీ మాటివ్వని మాట నిజం.

రాజ్యం బలవంతాన కాలేజీలో చేరింది. మొదట కాలేజీలో చదువులు సరిపడవనుకున్న సీనయ్యగారికి తీరా చేరాక బాగానే వున్నాయి. రాజ్యం కాలేజీలో చేరటం సీనయ్యగారి జీవితంలో మార్పు తెచ్చింది. సీరు కాకిబట్టలు తప్పితే ఇంకోటి వెయ్యని సీనయ్య నూలిపంచెలు, పాపులైను చొక్కాలు, సిల్కు కండువాలూ వెయ్యటం సాగించాడు. వెనక బీడీ తాగేవాడల్లా సిగరెట్లలోకి దిగాడు. కూతురుకోసం చిన్న జట్కా కొన్నాడుకూడా.

రాజ్యం తెలివితేటలు కాలేజీలో అంతగా పని చెయ్యలేదు. ఆమెకంటె తెలివిగలవాళ్లు, బాగా మార్కులు వచ్చేవాళ్లు అనేకమంది కనిపించారు. దాంతో మానసికంగా కొంత గర్వం తగ్గిందిగాని, తగ్గినట్టు కనిపించనీయదామె.

కాలేజీ వార్షికోత్సవ సమయంలో నాటకాలు వేస్తుంటే తనకీ వెయ్యాలని బుద్ధి పుట్టిందామెకు. కలగక కలగక అంతవూహ కలిగితే ఆమె వూరుకుంటుందా మరి? వెంటనే ప్రయత్నం చేసింది, ట్రూప్ ఆర్గనైజరును కలుసుకుంది. అతనో బి. ఏ. విద్యార్థి, ఆ నాటకం రాసింది కూడా అతనేట, రాజ్యం తెలివితేటల్ని గురించి తెలుసుకున్న తను అంతకుముందే బుక్ చేసుకున్న సుశీలను వదిలి రాజ్యాన్ని వేసుకున్నాడు. నాటకం రక్తి కడుతుందనే వుద్దేశ్యంతో.

రాజ్యం చదవటమయితే అనేక తెలుగు, ఇంగ్లీషు నాటకాలు చదివిందిగాని వేయటం చేర్వలేదు. పోర్షనులు వప్పచెప్పుకున్నారు. రిహార్సల్స్ ప్రారంభించారు. అందులో నాటకం వ్రాసిన కిష్టారావే హీరో వేషం వెయ్యటం. నాటకం అంతటికీ వచ్చేది యిద్దరే ఆడవాళ్లు. ఆ పాత్రలలో ఒకటి రాజ్యానికి రెండోది మరో

అమ్మాయికి. రాజ్యం నరి అయోమయంగా రిహార్సల్ ప్రారంభించింది. కిష్టారావుకు మొదట కోపం వచ్చిందిగాని, ఆమె తెలియకనే అట్లా చేస్తూందని తెలుసుకున్నాక శాంతించాడు. గడువైతే వున్నది యింకా కొద్దిరోజులే, కిష్టారావుకి భయమేస్తోంది, రాజ్యంతో ఎట్లాగా అని. పోనీ మరొకర్ని తీసుకుందామంటే పోర్షను వచ్చేప్పటికే నాటకం రోజు గడుస్తుంది. ఇక ఏమీ పాలుపోక ఒకరోజు సాయంత్రం గ్రౌండులో అడిగాడు రాజ్యాన్ని కిష్టారావు.

'ఏమండీ, ఓ విషయం అడగాలి, అడగమంటారా?'

అతనా మాటంటే ఆమెకు చెమటలు పోసినయ్, కాళ్లు తేలిపోయినయ్. గొంతు బొంగురుపోయింది. ఏమంటాడో, తన్నేమైనా తప్పుగా అర్థం చేసుకున్నాడా అనే భయంకొద్దీ 'అడగండీ' అన్నది.

'మీరింకా బాగా కృషిచెయ్యాలి' అన్నాడు.

'ఏ విషయం' అన్నది గాలినముల్తూ.

'నాటకం విషయం.'

'చేస్తాను' అన్నది చీరకొంగు నోటికడ్డం పెట్టుకుని.

'అంతేకాదు, మీకేమైనా తెలియనివి వుంటే అడగండి, ఇంకా ఎక్కువరోజులు లేవు. అదిగాక యిదే నాటకం పక్కవూరు కాలేజీకి, మన కాలేజీకి పోటీ' అన్నాడు ఆత్రుతగా.

'అయితే నన్నేంచెయ్యమంటారు చెప్పండి' అన్నది. ఆమెకళ్లల్లోకి నీళ్లు తిరగటం కనిపెట్టాడు కిష్టారావు. ఆమె 'ఈ నాటకంలో ఎందుకు చేరానా' అని పశ్చాత్తాపపడింది పాపం.

'మరోవిషయం, మీరేమీ అనుకోకండా వుంటే.'

'చెప్పండి, సాధ్యమైతే...'

'మీ యింటికొస్తే ఏమైనా అభ్యంతరం వుంటుందా.'

రాజ్యం మాట్లాడలేదు.

'ఆలోచించండి, నేనన్నాననికాదు, కాలేజీ పేరు పోకుండా వుండాలంటే, మనం హీనం కాకుండా వుండాలంటే వేరేమార్గం'—

'సరే—రండీ'—

'మరేం ఫరవాలేదు, మీరేమీ భయపడనవసరం లేదు కూడా.'

కిష్టారావు రాజ్యం యింటికి వెళ్ళాడు. సీనయ్యగారు మొదట అనుమానించాడు గాని కిష్టారావుతో మాట్లాడాక అతని ప్రవర్తన, మంచితనం, ఓర్పు, అన్నీ పసికట్టాడు. కిష్టారావును ఆయింటో అడ్డుపెట్టినవాళ్ళు లేరు.

రాజ్యం, కిష్టారావు రిహార్సల్సు, ప్రాక్టీసు మేడమీద-రెండోవారు పైకిపోవటానికి వీల్లేదు. రాత్రిళ్లు చాలా పొద్దుపోయిందాకా నాటకంలో మాటలే వినపడుతుండేవి.

కిష్టారావు ప్రతిరంగం అక్కడ ఏర్పాటు చేసి, అన్నీ చేసిచూపిస్తున్నాడు. అతను చేస్తూంటే రాజ్యానికి ఆశ్చర్యం కలిగింది, కాని చివరకు తాను చేయవలసిన అభినయం, రంగప్రవేశం, రసప్రదర్శనం అన్నీ చూపిస్తుంటే అసహ్యం గలిగింది. కాని అదే అభినయం తాను చేయవలసి వచ్చేటప్పటికి తన చేతకాలేదు.

కిష్టారావు, ఆమెను తాకితే, ముట్టుకుంటే, ఆమెకు ఏమిటోగా వుండేది, మొత్తం నాటకంలో ఓ అయిదారుసార్లన్నా చెయ్యిపట్టుకోడం భుజాలు తాకటం, బుగ్గలుతాకటం, ఈ పై విషయాలకి రాజ్యం అంగీకరించలేదు. కానీ కిష్టారావు 'రాజ్యంగారూ, మీరు అట్లా ఫీలయితే ఎట్లాచెప్పండి, మనం ఆడేది నాటకమని తెలిసికూడా భయపడతారెందుకు' అనేవాడు. 'రాజ్యం, నా ప్రతిష్ఠా, కాలేజీ ప్రతిష్ఠా మట్టిలో కలుపుతున్నావ్ రాజ్యం—అంతగాడికి ఎవరు రమ్మని బతిమాలారు చెప్పు'—అని ఏడ్చాడు. పాపం, దాంతో రాజ్యం హృదయం కరిగిపోయింది—

నాటకంనాడు రాత్రి—మద్రాసు నుండి పెద్ద ఆర్కెస్ట్రా పిలిపించారు. ఎవరికీ పాటలు లేకపోయినా ఆర్కెస్ట్రా అవసరం బాగా గుర్తించారు కాలేజీవాళ్ళు. నాటకం ప్రారంభించే ముందు మైక్లోంచి కొందరు పాటలుపాడారు, హాస్యంచేశారు, కొంతసేపు ఫిడేలు వాయించారు.

నాటకం ప్రారంభమైంది. నాలుగు కాలేజీల విద్యార్థులు హాల్లో నిండివున్నారు, విద్యాసంబంధీకులుగాక గవర్నమెంటు వుద్యోగులు

గొప్పవారు చాలామంది వచ్చారు. కలెక్టరు, డి. యస్. పి. మొదలైనవాళ్ళు, కాలేజీ సిబ్బందీ, యింకా యితరులు వచ్చారు.

నాటకంమధ్యలో ప్రిన్సిపాలుగారు ప్రేక్షకులకు నాటకాన్నిగురించి పరిచయంచేస్తూ, దాన్ని రాసింది, దాంట్లో వేస్తున్న హీరోయేనని, ఇంకేమేమో చెప్పాడు. వెంటనే నాటకం క్లైమాక్సులోకి పోయింది. కృష్ణారావు, రాజ్యం మేడపైనపడ్డ మధనకి ఫలితంగా అమోఘంగా వుంది. కృష్ణారావు చేతులు రాజ్యం భుజం చుట్టూ వేస్తూంటే హాల్లోంచి చప్పట్లు, కేకలు రేకులెగిరేట్టు వేశారు. రాజ్యానికి కోపంవచ్చి కృష్ణారావుకళ్ళల్లోకి చూసింది. అంతా నాటకమేనని సమాధానమిచ్చాడు కృష్ణారావు.

నాటకం పూర్తి అయాక డి. యస్. పి. స్టేజిమీదికి వచ్చి, వాళ్ళిద్దరి నటనను ప్రశంసిస్తూ లావాంటి పుస్తకాలు రెండు ప్రెజెంటుచేశాడు. అప్పుడు కృష్ణారావు, రాజ్యం చూసుకున్న చూపులు చాలా దూరంగా హృదయాల్ని లాక్కెళ్ళినయ్.

* * *

సూర్యారావుగారు మహీపురం జమీందారు గారు. ఆయనగారి జమీందారీ అంత పెద్దదికాకపోయినా సాలీనా రెండులక్షల ఆదాయంమాత్రం వస్తుంది. జమీందారు ఏ కాంగ్రెసు సిద్ధాంతాలసీ ఒప్పుకునే వాడు కాకపోవటంవల్ల ప్రజల్ని, ముఖ్యంగా భూస్వాముల్ని ఎలా గౌరవించాలిసింది, వాళ్ళ సహకారం ఎలా స్వీకరించాలిసింది తెలుసుకో లేదు. జమీందారుగారి మేడలు,తోటలు,జమీందారుని ఆశ్రయించుకొని బ్రతికే వారికి ఆ వూరిలో ఒకభాగం ప్రత్యేకంగా కేటాయించ బడింది.

సూర్యారావుగారు యువకు లవటంకన్నా వివాహంకావలసిన వారవటం సమంజసం. సరైన సంబంధాలు దొరక్క, దొరికినవి నచ్చక అవస్థ పడుతున్నారు. చాలామంది పెద్దపెద్ద జమీందారులే తమ కూతుళ్ళనిస్తామని ఖబురు చేశారు. కాని ఆ కూతుళ్ల ఫోటోలు చూశాక ఒప్పుకోలేదు సూర్యారావుగారు.

రాజ్యం, కృష్ణారావుల ఫోటోలు పేపర్లో పడ్డయ్. కాలేజీ నాటకంలో బంగారు పతకాలు సంపాదించిన విద్యార్థ నటీనటులు అని. రాజ్యం ఫోటో చూశాక చాలాసేపు కళ్లు తిప్పుకోలేకపోయాడు సూర్యారావు. రాజ్యం ఎవరో ఆయనకు తెలియదు. ఆమెకు పెండ్లయిందో కాలేదో తెలీదు. కాని రాజ్యంమూలాన అతనికి అశాంతి ఎక్కువకాసాగింది. రోజులు గడుస్తున్నకొద్దీ రాజ్యంమీద ప్రేమ, ఆమెకావాలనే కాంక్ష ఎక్కువౌతోంది. సూర్యారావుగారికి ఏంచెయ్యాలో తెలీలేదు మొదట-కాని కాలేజీలో కనుక్కుంటే తేలిపోతుందనుకున్నాడు.

* * *

సూర్యారావుగారు ఆఫీసురూంలోకి వచ్చేసరికి రాజ్యం ప్రిన్సిపాలుతో మాట్లాడుతోంది. సూర్యారావుగారు ప్రిన్సిపాలుగారికి నమస్కారంచేసికుర్చీలోకూర్చున్నారు, రాజ్యాన్ని చూసి ముగ్ధుడైపోయాడు, తనుయింతకాలంనుండి కోరుకుంటున్న స్త్రీ ఎదురవ్వటం తన అదృష్టం అనుకున్నాడు. సూర్యారావుగారు రాజ్యంవైపు గుటకలు మింగుతూ కూర్చోవటం రాజ్యానికి చీమలు కుట్టినట్టుయింది. ప్రిన్సిపాలు దగ్గర సెలవు తీసుకుని వెళ్లిపోయింది బయటకు.

సూర్యారావు రాజ్యాన్ని గురించి చాలావిషయాలు ప్రిన్సిపాలునుండే తెలుసుకున్నాడు. తను ఫలానా జమీందారు అని తెలిశాక తనను చాలా గౌరవించాడు ప్రిన్సిపాలు. ఆయనగారితో సహా సీనయ్యగారింటికి ప్రయాణమైనాడు.

సీనయ్యగారు జమీందరుగారి ఆగమనానికి చాలగా హర్షించాడు. అందులో తన కూతురి సంబంధానికి వచ్చారని తెలిశాక మరీ ఆయనసంతోషానికి పట్టపగ్గాల్లేవ్.

జమీందారు తనకైతాను తన కూతుర్ని అడగటం, తను కాదంటమూనా? అయినా మొదట కొంతసంశయించాడు. జమీందారుతో సంబంధం-తనా బీదసంసారి. నిజంగా పోల్చుకుంటే ఆయన ముందు తనెంత? తన సంసారమెంత? ఒకవేళ కాదంటే! జమీందారుకు కోపమొస్తుంది, ఎవరో వెనకటికి చెప్పినట్టు పిలిచి పిల్లనిస్తానంటే ఎత్తుకుదేసినట్టుంటుంది, అయినా కాళ్లదగ్గరకొచ్చిన సంబంధం కాదంటమెట్లా? వాళ్లు తీసిపోయినవారుకారు - అనుకోటానికీ, అనుమానించటానికీ- జమీందారు. తనుమాత్రం అంతకన్న పెద్ద

సంబంధం తీసుకురాగలనే మోనని ఆలోచించాడు సీనయ్యగారు. కాని ఆయన దృష్టిలో ఆ మాత్రం సంబంధం మరోటి కనిపించలేదు. ఏం తక్కువ కాబట్టి తను అనుమానించటం! నిక్షేపంలాంటి జమీ, భోగలాలసతకే కొదువుండదు, అమ్మాయికి వేరే పనేమీ వుండదు.

అన్నివిధాలా రాజ్యం సుఖపట్టానికి అంతకన్న మార్గం ఆలోచించలేక పోయాడు సీనయ్యగారు. సీనయ్య భార్యకూడా ఆ సంబంధానికి ఒప్పుకుంది. అసలు జమీందారుగారి ఇంటిలో జీవితం ఎట్లా వుంటుందోనని, అట్లాంటి సౌఖ్యం అనుభవించాలని ఆమె కోరిక - జమీందారుగారి సంబంధం స్థిరపడ్డాక సీనయ్యభార్యకు అకస్మాత్తుగా ఒకవిషయం జ్ఞాపకానికి వచ్చింది. రాజ్యం రాజమ్మగా వుండే రోజుల్లో ఓసారి తులసమ్మపిన్ని దీవించింది రాజ్యాన్ని -'నీ కేంటే! జమిందారు భోగం అనుభవిస్తావు' అని. ఆ తులసమ్మ ఎంతదూరదృష్టి గల మనిషో అనుకుంది- ఆ నిమిషంలో సీనయ్యగారి భార్య.

ఆ సంబంధం రాజ్యానికి సుతరామూ యిష్టం లేదు. తనా చదువుకుంది. ఇంకాగొప్ప చదువులు చదవాలనుకుంటోంది కూడా. అట్లాంటి తనకు పెళ్ళిచేయటం, అందులో జమీందారుతోనా? ఆ సమయంలో గొప్పింటివారు కొద్దింటివార్ని ఎలా గౌరవిస్తారో జ్ఞాపకం వచ్చింది. ఈ సంబంధము సాగితే రేపు తన తలిదండ్రుల్ని అంతే గౌరవిస్తారుగద జమిందారువారు. అని అంచనా.

కానీ రాజ్యం ఆటలేమీ సాగలేదు. ఆమె యిష్టప్రకారం జరిగే రోజులు వెనక్కి పోయినయ్. ఆమెను కాలేజీ మాన్పించారు. వెనకటిలాగా అటూ-యిటూ తిరగనీయటం లేదు. ఇక రాజ్యం రాజ్యంకాదు. జమిందారిణి. అంటే పువ్వుల్లో నడుస్తుందని వారిభావం. కాబోయే జమిందారిణి మీద యిప్పటి నుండే ఈగ వాలనిచ్చేవారు గాదు. దోమను కరవనిచ్చేవారు గాదు. సీనయ్య భార్య సినిమాల్లో చూసిన రాణీలను జ్ఞాపకం తెచ్చుకుంది. అట్లా సింహాసనంలో కూర్చోటం, దాసీలు వింజామరలతో విసరటం, అమ్మగారు అన్నీ ఆజ్ఞాపించటం, దాసీలు, చెలికత్తెలు, నౌకర్లూ, చాకర్లూ, అబ్బా ఎంత భోగం, ఎంతభోగం-నిజంగా అవన్నీ జరుగుతున్నట్టుగానే సంతోషించింది సీనయ్య భార్య.

జమీందారుగారి ఆచారప్రకారం, పిల్లవాడి యింట్లోనే పెండ్లి ఏర్పాటైంది. సీనయ్యగారి తరఫు వారికి పెద్ద మేడలు మూడు విడిదిగా ఏర్పాటుచేశారు. జమీందారుగారి పేటంతా పందిరులు, నగిషీలు, ఎంతో అందంగా అలంకరించారు. మద్రాసు, కలకత్తా, బొంబాయినుంచి గొప్పగొప్ప సినీమా పాటగాళ్లు, నాట్యకారులు వచ్చారు. బ్రహ్మాండం ఐన ఏర్పాటు జరిగింది. దేశంలోని మూడువందలమంది జమీందారులకు ఆహ్వానాలు పోయినట్టుగా వార్తలు తెలిశాయి. ఇవన్నీ చూస్తుంటే సీనయ్యగారికి సింహాసనం ఎక్కినట్లు వుంది. అసలు పెండ్లి జరగబోయేది తన కూతురుకో, దేవేంద్రుడి కూతురుకో అర్థంగాక చాలాసార్లు తడబాటుపడ్డాడు సీనయ్య. ఆయనభార్య పరిస్థితికూడా అట్లాగే వుంది.

ఇంత పెద్ద ఏర్పాటును ఎదుర్కోటానికి సీనయ్యగారు చాలా యిబ్బందిపడ్డాడు. కొన్ని అద్దెకార్లు తెప్పించుకున్నాడు. పెద్దపెద్ద వుద్యోగస్తుల్ని పిలిపించాడు. తనవైపు బంధువుల్ని పెద్ద తరగతివాళ్లను మాత్రమే పిలిచాడు.

పెళ్ళికి బెట్టుచేసిన రాజ్యం పెళ్లి అయిన నాటినుండీ బాగానేవుంది. జమీందారుమీద మొదటవున్న ఏవగింపు కరిగిపోయింది. పోగా ఒక విధమయిన అభిమానం ఏర్పడ్డది. అంతఃపురంలో పెత్తనమంతా తనదే. జమీందారుగారు తానంటే ప్రాణాలిస్తాడు.

ఆమాత్రం పగపతి సంపాదించుకోబట్టే అమ్మగారంటే అందరికీ భయం. జమీందారుగారంటే అమ్మగారనే అందరిదృష్టిలో. ఆమె ఎంతంటే అంత. జమీందారుగారికి రాజ్యంఅంటే అంతులేని ప్రేమ ఏర్పడ్డది. రాత్రిళ్లు ఒక్క నిమిషం వదిలి వుండలేని పరిస్థితి ఏర్పడ్డది. పెల్లవారి బాగా ఎండెక్కిగాని మేడదిగిరారు, సాధ్యమయినంత తొందరలోనే మేడెక్కడానికి ప్రయత్నిస్తుంటారు.

అమధ్య సూర్యారావుగారు షికారు మానేశారు. గుర్రాలకు కాళ్లు కదుప్పడుతున్నయ్. ఒకవేళ వెళ్లినా రాజ్యంతోసహా కారుమీద వెళ్లటమేగాని గుఱ్ఱపుస్వారికే తీరుబడి చేసుకోలేక పోతున్నారు.

రాజ్యానికి జీవితం ఒకేగాట్లో నడవటం యిష్టంలేదు. ఎదుగూ బొదుగూ లేని జీవితాలు అంతగా ఏం జీవితాలు, ఏం కాంతి వుంటుంది? ఏం సౌఖ్యంవుంటుంది. ఈమధ్య రాజ్యం చదువులు మానేసింది, అసలు చదవటానికి తీరిక వుంటేగా? రాత్రల్లా మేకప్పైన, పగలల్లా షోకులు చేసుకోవటం, నిద్రపోవటం— కాని రానురాను రాజ్యానికివిసువుపుట్టటంప్రారంభించింది. మనస్సు పుస్తకాలమీదికి పోయింది. మంచిమంచి పుస్తకాలుంటే ఎంత బావుంటుంది ఆ సమయంలో! ఎంత ఆనందం అనుభవించవచ్చు! అనుకుంది.

ఒకరోజు రాత్రి సూర్యారావుగారిని అడిగింది పుస్తకాలు ఏవైనా తెప్పించమని. కాని సూర్యారావు మాట్లాడలేదు. ఒకటికి నాలుగు సార్లు అడిగాక తప్పనిసరిగా చెప్పాడు. 'ఎందుకు పాడుపుస్తకాలు' అని.

రాజ్యానికి కోపంవచ్చింది. తను పుస్తకాలు కావాలంటే ఎందుకూ? అంటాడా?! అయితే తానీవిధంగానే బతకాలా? తాను చదివిన చదువులన్నీ ఇందుకోసమేనా? చదువుల ఫలితం వేరే లేనే లేదా?

ఓరోజుసాయంత్రం సూర్యారావు మేడమీదికొచ్చేసరికి రాజ్యం కనిపించలేదు. సూర్యారావుకు ఆరాటం ఎక్కువైంది. అడిగాడు దాసీని. 'పట్టణం వెళ్ళారు, సాయంత్రం వస్తామన్నారు' అని చెప్పింది. సూర్యారావు కళ్ళు ఎర్రబడ్డయ్, కాళ్ళు ఒణికినయ్, చేతులకు కండపట్టి ఎక్కడలేని శక్తి వచ్చింది.

రాజ్యం కారుదిగేటప్పటికి చీకటి పడింది. ఆమెవెనకాలే డ్రైవరు పుస్తకాలకట్ట మోసుకుని లోపల ప్రవేశించాడు. సూర్యారావుగారు సోఫాలో పడుకుని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. రాజ్యం ప్రవేశిస్తూ 'ఏం పడుకున్నారు-ఒక్కరికీ ఏమీ తోచటంలేదు, కొంచెం ఆలస్యమైంది, వుండండీ వస్తున్నా' అని లోపలికి పోయింది బట్టలు మార్చుకునేందుకు.

మరునాటినుండీ ఆయన దృష్టిలో రాజ్యంలో మార్పు కనపడసాగింది. రాజ్యం యిప్పుడు తన కాలమంతా చదువులకే వెచ్చిస్తోన్నట్లు అనుమానించాడు.

ఓరోజు రాత్రి సూర్యారావు మేడమీదికి వచ్చేప్పటికి రాజ్యం పరుపుమీద పడుకుని ఏడుస్తోంది.

"ఏం రాజ్యం ఏడుస్తున్నావు" అన్నాడు సూర్యారావు.

రాజ్యం మాట్లాడలేదు చాలసేపు.

రాజ్యానికి తెలుసు ఆయనెందుకు అడుగుతుందీ.

సూర్యారావుకు తెలుసు ఆమెందుకు ఏడుస్తోందీ.

రాజ్యానికి తెలియదు అతనెందుకుతగలబెట్టించిందీ.

సూర్యారావుకు తెలుసు ఆమె ఎందుకు భద్రం చేసుకుందీ.

మొత్తానికి సూర్యారావు పుస్తకాలు తగలబెట్టించిన మాట నిజం. ఆ విషయం ముందుగా రాజ్యానికి తెలియదు. తెలిస్తే ఏం చేసేదో చెప్పలేం. కాని తనకు తెలియకుండా తగలబెట్టించటం ఆమెకు కష్టం కలిగించింది. అతనికిష్టం లేకపోతే చదవటం మానుకోవాలి కాని తగలెయ్యడమేమిటి రాక్షసత్వం - అపని చిన్నపిల్లలు చేయవలసింది. జమిందారులాటివాళ్లు? ఈపని జరిగిన తరువాత సూర్యారావు మనస్తత్వం ఎంతనీచమైందీ ఆమె వూహించలేకపోయింది. అసలు ఆమె వూహకు అందటం లేదుకూడా.

రోజు రోజుకీ సూర్యారావంటే రాజ్యానికి అసహ్యం ఎక్కువకాసాగింది. ఇప్పుడు అంతగా అతనితో తిరగటంలేదు. వుండటంలేదు.

సూర్యారావుగారు తాగటం ప్రారంభించారు. విపరీతంగా తాగటం, తిరగటం. ఇదివరస. అతను తాగి తనవద్దకు వచ్చి గోలచేస్తుంటే రాజ్యానికి తగని చీదర వేసేది. కాని ఏమీ చేయలేక పోయేది.

ఒక్క తాగుడే కాకుండా భోగంవాళ్లని పెట్టుకుని వూరేగుతున్నాడని కూడా వినికిడి. అయినా రాజ్యం ఆ విషయం ఎప్పుడూ ఆయన్ని అడగలేదు. అయినే ఎవరెట్లా పోయినా ఆమె ఏమీ పట్టించుకోదలచలేదు.

* * *

కూతురు పెళ్ళితో సీనయ్యగారి అదృష్టం వెనక్కి తిరిగి వెక్కిరించింది. ఇప్పుడు సీనయ్య

గారు పట్టణం వదలి పుట్టిన వూరు చేరుకున్నాడు. ఇంతకాలం కవులుకిచ్చిన పొలం చేతి సొగుబడికి పుచ్చుకున్నాడు. బూజుపట్టిన కొంప బూజు దులిపించి, సున్నం కొట్టించి గృహ ప్రవేశం చేశాడు. తిరిగి ఇప్పుడు సీనయ్య జీవితంలో ఆవులు, గేదెలు, పొలాలు, అరకలు ప్రారంభం.

రాజ్యం పెండ్లితో తన బాధ్యత పూర్తి చేసుకున్న వాడయ్యాడు. కూతురు జీవితం ఒక గాట్లో నడిచిపోతుంటే చూసి సంతోషించటం కన్న ఏం కావాలి ఆ వయసులో తనకి? అదే సీనయ్య భార్యకూడా ఆశించింది.

చాలాకాలం వరకూ రాజ్యం సుఖంగానే వుందని తెలుస్తూ వచ్చింది. కాని ఎప్పుడూ పుట్టింటికి వచ్చిన పాపాన పోలేదు. రావటానికి తొలిరోజుల్లో అవకాశం దొరికేదికాదు నిజానికి. అందుకనే సీనయ్యగారు కూడా గట్టిగా పంప మని అల్లుణ్ణి అడగలేక పోయాడు.

ఎక్కడుంటే ఏంతే సుఖంగా వుంటే అంతే చాలు అని సమర్థించుకుంది సీనయ్య భార్య.

ఇప్పుడు సీనయ్యకు రాజ్యం విషయాలేవీ తెలీటంలేదు. అందువల్లనే అనుమానించాడు కొంతవరకూ. కాని వెనకటివలె రాజ్యం షికార్లు మానేసిందని, పైగా చిక్కిపోతోందని, ఎవరికీ కనిపించటం లేదనీ తెలుసుకున్నాక సీనయ్య గారి అనుమానం ఎక్కువయింది.

ఆమధ్య సీనయ్య దగ్గిరబంధువు ఒకాయన వెళ్లితే రాజమ్మను చూట్టానికే వీల్లేకపోయిం దట. ఏదో అవస్థపడి చూసి ఓ ఐదునిమిషాలు మాట్లాడేప్పటికే ఎవరో రమ్మని పిలిచారుట. ఆమెకంటతడిపెట్టుకుని వెళ్ళిపోయిందని తెలిసింది.

*　　*　　*

కృష్ణారావుగారు బి. ఏ. పూర్తిచేసి గుంటూరులో నాటకకంపెనీ స్థాపించిన సంగతి పేపర్లో చదివింది రాజ్యం. బ్రహ్మాండమైన నాటక ప్రదర్శనాలతో ఆంధ్రదేశమంతటా పర్యటిస్తు న్నారనికూడా తెలుసుకుంది. సొంత నాటకాలు, ప్రతి నాటకంలో సొంతపాత్ర, సొంత ఆర్గ నైజేషన్. ఎంతో చక్కగా నేర్పగలడు. కృష్ణా రావు నాటక సమాజాన్నిగురించి దిగ్విజయ వార్తలు ప్రచురింపబడుతున్నాయి. తెనాలి, బెజ వాడ, వైజాగ్, మద్రాసు, - రోజురోజుకీ ప్రోగ్రాములు హెచ్చుతున్నాయి.

సూర్యారావుగారు మహీపురంలో నాటకం ఏర్పాటుచేశారు. ఆ విషయం పేపర్లో చదివిం దాకా రాజ్యానికి తెలియదు. తీరా విషయం తెలుసుకున్నాక సంతోషించింది. తాను వేసిన నాటకం సంగతి జ్ఞాపకం వచ్చింది. అబ్బ, కృష్ణా రావుతో నాటకం వేస్తూంటే ఎంత హాయిగా వుంది అప్పుడు! ఆ సౌఖ్యం తిరిగీ జన్మలో సంపాదించుకోలేదు తను తిరిగి.

నాటకంరోజు సమీపించింది. పెద్ద పెట్టున ఏర్పాటు జరిగింది. నాటకానికి తనను పిలిచిన వాళ్లు లేకపోయారు. అయినా రాజ్యం వూరుకో దలచలేదు. నాటకంరోజు వుదయం కృష్ణారావుకు ఓ ఉత్తరం పంపింది, రాత్రి నాటకంలో తను వేషంవేస్తాననీ, ఆనాటి నాటకం ఏర్పాటు చేయమనీ, అంతా రహస్యం అనీ.

కృష్ణారావు వుత్తరం చూసిఆశ్చర్యపోయాడు. ఆమె జమీందారిణి. తనా, కళారాధకుడు.

రాత్రి నాటకం ఏర్పాటు జరిగింది. జమీం దారు, ఇతర ఉద్యోగులు, ప్రజలు అంతా వచ్చారు. రాజ్యం సంగతి సూర్యారావుకు అసలు జ్ఞాపకం రాలేదు రావాలిసిన అవసరంకూడా లేదేమో. అది రాజ్యంకోసం ఏర్పాటు చేసింది గాదు. జమీందారుగారి అతి ప్రియమైన భోగం దానికోసం ఏర్పాటైంది.

కృష్ణారావు రాజ్యంతో అన్ని విషయాలు గ్రీన్ రూమ్‌లోనే మాట్లాడాడు. రాజ్యం జీవితంలో ఎలాంటి అవాంతరాలు ఏర్పడ్డాయో తెలుసు కున్నాడు.

నాటకంలో కృష్ణారావు, రాజ్యం, ప్రధాన పాత్రలు ధరించారు. ఆ వేసింది రాజ్యం అనే సంగతి సూర్యారావుగారికి తెలియదు. అసలు అనుమానించలేని నిషా పరిస్థితుల్లో వున్నాడు కూడాను. నాటకం హుషారుగా సాగింది. నాటకంలో నాయిక సూర్యారావుగారిని ఆకర్షిం చింది. జమీందారుగారు కోరితే అనుచరులు ఉపేక్షిస్తారా? అయినా రాజాగారు తలుచు కుంటే దెబ్బలకు కొదవగనకనా? అన్వేషణ ప్రారంభించాడు. సూర్యారావు జమీందారు గారికి తపన ఎక్కువ కాసాగింది. ఆమెనుగురించి ఆరాలు తీయటానికి స్వయంగా పూనుకున్నాడు.

సూర్యారావుగారు రాజ్యం విషయం పూర్తిగా మరిచిపోయాడు. మరునాడు కృష్ణారావుని తన మేడమీదికి పిలిపించుకున్నాడు. ఆయన అనేక విషయాలు మాట్లాడాడు. నాటకాల అవసరాన్ని గురించి కొంచెంసేపు మాట్లాడాడు. కొంచెంసేపు నటుల్ని విమర్శించాడు. నటీమణుల్ని పొగిడాడు. ఆయన నాటకాల్లో సహకరిస్తున్న వాళ్లుచాలామంచివాళ్ళని, తెలివిగల వాళ్ళని, పైకి రాగల అవకాశాలున్నాయనీ తెలియచేశాడు.

సూర్యారావుగారి అవస్థ కృష్ణారావుకు తెలియక పోలేదు. ఇన్ని తెలివితేటల్ని ప్రదర్శిస్తున్న జమీందారు బుద్ధి కక్కుబుద్ధనే విషయం రాజ్యం తనతో చెప్పింది. కృష్ణారావు గప్‌చిప్‌గా వెళ్ళిపోయాడు.

ఆరాత్రి నాటకంలో వేసింది ఆవూరి ఆమేనని బజార్లలో అనుకుంటుండగా ఎవరో విని సూర్యారావుతో చెప్పారు. సూర్యారావు వివరాలు తెలుసుకుంటున్నాడు.

రాజ్యం నాటకంనాడు దివాణంలో లేదనీ, నాయిక వేషం వేసింది ఆమేననీ పూర్తివివరాలు సేకరించుకున్నాడు. రాజ్యాన్ని కట్టడి చేయడానికి కూడా నిశ్చయించుకున్నాడు.

ఇప్పుడు రాజ్యం బయటకు వెళ్ళటానికి వీల్లేదు. ఒంటరిగా వుంటానికి వీల్లేదు. పదిమంది కాపలా ఆమె చుట్టూ, పరిచారికలు పక్కనే ఎప్పుడూ, పుస్తకాలకు దూరమయింది, ఆమెతో యితరులెవరూ మాట్లాడ్డానికి వీల్లేదు, ఆమె దగ్గర బంధువులు కూడా రావటానికి వీల్లేదు. వచ్చినా ఆమెను చూట్టానికి మాట్లాడ్డానికివీల్లేదు.

రాజ్యం రోజురోజుకూ క్రుంగిపోతోంది, [illegible] మయిన దిగులు ఏర్పడ్డది పూర్తిగా. జమీందారు గారి దేవిడీలో సుఖంలేదు, ఇంక ఆగలేదు. ఏం చూసుకొని జీవించటమో ఆమెకర్థంకాలేదు. నానాటికీ తీసిపోయింది.

రాజ్యం మంచానపడ్డదనీ, ఇంక ఎక్కువ కాలం బతకదనీ వచ్చినవార్త పిడుగులాగా పని చేసింది సీనయ్యగారిమీద. రాజ్యం జీవితం తన వల్లనే నాశనమయిందని పశ్చాత్తాప పడ్డాడు. తిట్టాడు, తనను తిట్టుకున్నాడు. సీనయ్య భార్య అల్లుణ్ణి తెగరాల్చిపోసింది.

ఆమరునాడే రాజమ్మ చచ్చిపోయిందనే వార్త ఊరంతా పాకింది. జమీందారు కట్టడిలోనలిగిపోయి, ఉక్కిరిబిక్కిరై ప్రాణాలు వొదిలింది. చివరికి సీనయ్య పశ్చాత్తాపపడాడు. నిక్షేపంలాంటి కూతురు, మరే మగాడికిచ్చినా సుఖంగా బతికేది బిడ్డ. జమీందారు చేతుల్లో పెట్టి నిప్పులుపోశాం. అసలు చిట్టితల్లిని ఇంకా చదివిస్తే ఎంతబావుండేది, దానికి చదువుకోవాలనే వుంది, కానే అటకాయించాను. ఏదో జరగబోతుందని. దేశంలో తనలాంటి వాళ్లను భగవంతుడు ఎందుకు పుట్టిస్తాడో అర్థం చేసుకో లేకపోయాడు. బిడ్డల మంచిని తెలుసుకోలేని తనలాంటి వాళ్లు పిల్లల్ని ఎందుకు కంటారో అర్థం కాలేదు. సీనయ్య భోరున ఏడ్చాడు, మొత్తుకున్నాడు, కానీ ఏమీ చేయలేక పోయినాడు.

సీనయ్య భార్య అగ్గిలాగా మండింది. కూతురుబతుకిట్టా బండలై పోయినందుకు సీనయ్యను తెగతిట్టింది. మెటికలు విరిచింది. భోరు భోరుమని ఏడ్చింది.

వూళ్ళో వారంతా సీనయ్యను పరామర్శించటం ప్రారంభించారు. రాజమ్మ మంచితనం గురించి, సీనయ్య ఆమెకు చేసిన అన్యాయం గురించి గొడ్డగాడ పిల్లలుగూడా వేలెత్తి చూపడం మొదలెట్టారు

ఒక్కగానొక్క కూతురు చావుతో సీనయ్య జీవితం చావుబతుకుల అంచులమీదికి వచ్చింది. వెనకటిలాగే వ్యవసాయం చేయటంతగ్గించాడు. పొలాలన్నీ కవులుకిచ్చాడు, ఇంట్లో కూర్చోని ఒక్కటేవిచారం ఎప్పుడూ రాజ్యం రాజ్యం అని.

సీనయ్య భార్య, మనిషి మరీ సగంలాగ తయారైంది, వెనక చూసిన వాళ్ళెవ్వరూ గుర్తుపట్టలేరామెను. ఏ రోగమూ, నొప్పీ లేక మనిషి డీలాబడిపోవటం రాజ్యంవల్లనే నని ప్రతివారికి తెలుసు. కాని యెవరూ అంతగా పట్టించుకున్న పాపాన పోలేదు. సీనయ్య భార్య ఎప్పుడూ భగవంతుని ప్రార్థించేది-తనను కూడా తొందరగా ఎత్తుకెళ్ళమని. లోపల్లోపల సీనయ్యగారు కూడా అంతే వేడుకునేవాడు.

కాని పైకి, నానారభసా చేస్తున్న సీనయ్య భార్య మొరాలకించని భగవంతుడు సీనయ్య ప్రార్థన స్వీకరించలేకపోయాడు.